క్లుప్తంగా

అనాథ వృద్ధాశ్రమ నూతన భవనం ప్రారంభం



అనాథ వృద్ధాశ్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని సర్‌సిల్క్‌లోని అనాథ వృద్ధాశ్రమ భవనాన్ని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దాతల సహకారంతో వృద్ధాశ్రమ భవన నిర్మాణం చేసుకోవడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం తరఫున వృద్ధాశ్రమానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

అమ్మవారికి బోనం



భద్రకాళికి బోనం సమర్పిస్తున్న మహిళలు

పెంచికల్‌పేట్: దేవీ నవరాత్రులు పురస్కరించుకుని మండలంలోని పంచకళపురి క్షేత్రంలోని శ్రీ భద్రకాళీ సమేత వీర భద్రస్వామి అమ్మవారికి శుక్రవారం మహిళలు బోనం సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో నైవేద్యం తయారు చేసి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన పూజారి శ్రీ మూలమఠం ప్రసాద్ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. కొత్తగూడ శారదామాత మండపం వద్ద అన్నదానం నిర్వహించారు.

నిత్యావసర సరుకులు అందజేత



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న పోలీసులు

లింగాపూర్: మండలంలోని మోడిగూడా గ్రామానికి చెందిన కనక భీంరావు, అతని భార్య కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో వారి ఆరుగురు పిల్లలు అనాథలయ్యారు. విషయం తెలుసుకున్న జైనూర్ సీఐ రమేశ్, లింగాపూర్ ఎస్సై గంగన్న శుక్రవారం మోడిగూడా గ్రామానికి వెళ్లి వారికి నిత్యావసర సరుకులు అందజేశారు. అనంతరం కీమానాయక్ తండా గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పద్మావత్ చిరంజీవి కూడా రూ.2వేలు ఆర్థికసాయం అందించారు.

లో లెవల్ బ్రిడ్జికి మరమ్మతు



బ్రిడ్జికి మరమ్మతు చేస్తున్న గ్రామస్తులు

లింగాపూర్: నెలరోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని నాగుగూడాలోని లోలెవల్ వంతెన వరదకు దెబ్బతింది. అప్పటి నుంచి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గ్రామస్తులు, జ్వర పీడితులు, గర్భిణులు వంతెన దాటాలంటే కనీసం గంట నుంచి రెండు గంటల వరకు పడుతోంది. దీంతో శుక్రవారం గ్రామస్తులు, యువకులు బ్రిడ్జిపై బండరాళ్లు పేర్చారు. మొరం తెప్పించి చదును చేసి మరమ్మతు చేసుకున్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న గ్రామస్తులు

ఆసిఫాబాద్‌రూరల్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని గుండి గ్రామానికి చెందిన కోలే ప్రవీణ్ చికిత్స కోసం వాట్సప్ గ్రూప్ ద్వారా విరాళంగా సేకరించిన రూ.1,37,421 నగదును శుక్రవారం అతడి తల్లికి అందజేశారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి కూడా రూ.50వేలు అందించారు. వైద్యులు ప్రవీణ్ వైద్యఖర్చుల కోసం రూ.15 లక్షల వరకు అవుతుందని అతడి కుటుంబీకులు తెలిపారు. ఇప్పటివరకు సాయం అందించినవారికి కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా సాయం అందించాలనుకునే దాతలు 9705637527, 9959795152 నంబర్లకు ఫోన్ పే చేసి ఆదుకోవాలని కోరారు.

ఆకతాయిలకు కౌన్సెలింగ్

కాగజ్‌నగర్‌టౌన్: దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని త్రిశూల్ పహాడ్‌పై రావణసుర దహన సమయంలో అమ్మాయిలను వేధించిన ఆరుగురు ఆకతాయిలను పట్టుకున్నట్లు షీటీం ఇన్‌చార్జి సునీత శుక్రవారం తెలిపారు. యువకులకు తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. మహిళలు, యువతులు వేధింపులకు గురైతే షీటీంను సంప్రదించాలని సూచించారు.

రోడ్లపై పశువుల సంచారం



రోడ్డుకు అడ్డుగా పడుకున్న పశువులు

- రాకపోకలకు తీవ్ర ఆటంకం
- ఇబ్బందుల్లో వాహనచోదకులు

కెరమెరి: పశువులు రోడ్లపైకి వస్తున్నాయి. రహదారులనే ఆవాసాలుగా మార్చుకుంటున్నాయి. ప్రధాన కూడళ్లలో గంటల తరబడి సేద తీరుతున్నాయి. రహదారుల పక్కన పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను పడదోస్తున్నాయి. వీటి యజమానులను గ్రామపంచాయతీ అధికారులు గతంలో హెచ్చరించినా వారిలో మార్పు రాలేదు. యథేచ్ఛగా పశువులను రోడ్లపైకి వదులుతూనే ఉన్నారు.

యజమానులను హెచ్చరించినా..

ఆదిలాబాద్‌-ఆసిఫాబాద్ ప్రధాన రహదారులపై వేగంగా వెళ్తున్న వాహనాలకు పశువులు అడ్డుగా వెళ్తున్నాయి. బస్సుల రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్నాయి. కుమురం భీం ఫొటో స్టూడియో,



ఏటీఎం ప్రాంగణంలో..

నూతనంగా నిర్మించిన వంతెన, సుల్తాన్‌గూడ, ఏటీఎం కేంద్ర పరిసరాలు, బస్టాండ్ ప్రాంతాల్లో ఎక్కువగా సంచరిస్తున్నాయి. రోడ్లపైనే మల, మూత్ర విసర్జన చేయడంతో వేకువజామున వాకింగ్ వెళ్లేవారు ఇబ్బంది పడుతున్నారు. గతంలో పలుసార్లు పశువులను పట్టుకుని యజమానులకు జరిమానా విధించినా వారిలో మార్పు రాలేదు.

చాలా కాలంగా ఇలాగే..

పశువులను రోడ్లపైకి వదలడం యజమానులకు అలవాటుగా మారింది. చాలాసార్లు పశువులు ద్విచక్ర వాహనదారులకు అపాయం కలిగించిన సందర్భాలున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇదే తంతు కొనసాగుతోంది. కొన్ని పశువులు ఇళ్లలోకి వెళ్లి జనాల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. రోడ్లపై పశువులు ఉంటున్న కారణంగా చిన్నారులు షాపులు, స్కూళ్లకు వెళ్లేందుకు జంకుతున్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ, పోలీస్ అధికారులు యజమానులను పిలిపించి పశువులను రోడ్లపైకి వదలకుండా చర్యలు చేపట్టాలని వాహనచోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కరిస్తాం



ఇప్పటికే చాలాసార్లు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో యజమానులకు చెప్పాం. పలువురికి జరిమానా కూడా విధించాం. కానీ, వారిలో ఇంకా మార్పు రాలేదు. మరోసారి గ్రామపంచాయతీ కార్యదర్శి ద్వారా సమాచారం ఇస్తాం. రోడ్లపైకి వచ్చే పశువులకు సంబంధించి వాటి యజమానుల వివరాలు సేకరిస్తాం. సరైన నిర్ణయం తీసుకుని పశువులు రోడ్లపైకి రాకుండా సమస్య పరిష్కరిస్తాం.

– అంజద్‌పాషా, ఎంపీడీవో, కెరమెరి

మహనీయులకు ఘన నివాళి

- ఘనంగా గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రిల జయంతి

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలో గాంధీ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు తన నివాసంలో గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. విశ్రాంత ఉద్యోగ సంఘం భవనంలో గాంధీ జయంతి, లాల్‌బహదూర్ శాస్త్రిల జయంతి నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ గాంధీ సత్యాగ్రహాలు నిర్వహించి తెల్లదొరలను తరిమికొట్టి భారత దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించారన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు జయదేవ్, శివప్రసాద్, రాజేంద్రప్రసాద్, చంద్రమౌళి, అన్వర్, అహ్మద్, అంకయ్య, మురళీధర్, పురుషోత్తం, సత్యనారాయణ, నర్సయ్య, రాజేశ్వర్, స్వామి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో గురువారం మహాత్మాగాంధీ జయంతిని ఘనంగా జరుపుకొన్నారు. ఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఏఎస్పీ చిత్తరంజన్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ



కాగజ్‌నగర్‌టౌన్: నివాళులర్పిస్తున్న రిటైర్డ్ ఉద్యోగ సంఘం నాయకులు

అహింసా మార్గం ద్వారా దేశానికి స్వాతంత్ర్యం సాధించారని కొనియాడారు. గాంధీజీ చూపిన మార్గం నేటి యువతకు అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు అంజన్న, పెద్దన్న, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గోలేటి టౌన్‌షిప్‌లో..

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో గురువారం గాంధీజీ చిత్రపటానికి బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఖైరిగూర పీవో నరేందర్, ఏజీఎం కృష్ణమూర్తి, డీజీఎం ఉజ్వల్‌కుమార్, ఎస్‌కే మదీనా బాషా, సీహెచ్‌పీ ఎస్ఈ కోటయ్య, ఏఎస్‌వో శ్రీధర్, పర్సనల్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ శ్రీనివాస్ తదితరులున్నారు.



ఆసిఫాబాద్: గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్



రెబ్బెన: గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న జీఎం విజయభాస్కర్‌రెడ్డి

భక్తిశ్రద్ధలతో దుర్గాదేవి నిమజ్జనం



దహెగాం: మంగళహారతులతో శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు



చినరాస్పెల్లిలో అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

దహెగాం: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవిని శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. మండల కేంద్రంలోని స్థానిక శివాలయంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవిని నిమజ్జనం చేశారు. ముందుగా వీధుల గుండా శోభాయాత్ర చేపట్టారు. ఈసందర్భంగా మహిళలు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం సమీపంలోని వాగులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పూజలు

మండలంలోని చినరాస్పెల్లి గ్రామంలో శరన్నవరాత్రుల్లో భాగంగా ఏర్పాటు చేసిన దుర్గాదేవిని శుక్రవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించి పాడిపంటలు బాగుండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. అనంతరం ప్రజలకు, కార్యకర్తలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌అర్బన్: శరన్నవరాత్రులను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో గతనెల 23న కొలువుదీరిన దుర్గా, శారదామాత విగ్రహాలను శుక్రవారం అత్యంత భక్తి శ్రద్ధలతో శోభాయాత్రగా తరలిస్తూ స్థానిక పెద్దవాగులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక వాహనాల్లో అమ్మవారిని డీజే చప్పుళ్లు, బ్యాండు మేళాల మధ్య శోభాయాత్రగా తీసుకువెళ్లారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైరాగడే ప్రతాప్, పరండె సాయి, బాబుగౌడ్, విలాస్, అశ్విన్, శంకర్, వెంకన్న, ఆనంద్, ప్రభాకర్, సుగుణాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



పెద్దవాగులో నిమజ్జనం చేస్తున్న భక్తులు

ఘనంగా దసరా వేడుకలు



దహెగాంలో జమ్మి చెట్టుకు పూజలు

దహెగాం: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో గురువారం దసరా పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ప్రజలు జమ్మి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నాపెద్దా తేడా లేకుండా జమ్మి ఆకు (బంగారం) ఒకరికొకరు ఇచ్చుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

బెజ్జూర్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో గురువారం విజయదశమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో సాయంత్రం వేళ ప్రజలు భాజాభజంత్రీలతో సమీపంలోని జమ్మి చెట్టు వద్దకు చేరుకున్నారు. జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు జరిపారు.

ఆసిఫాబాద్‌రూరల్: దసరా సందర్భంగా గురువారం మండలంలోని మోతుగూడ, బూర్గుడ, రాజుర, బెల్గా తదితర గ్రామాల్లో వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జమ్మి ఆకు ఒకరికొకరు పంచుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఆలయాల్లో వాహన పూజలు చేశారు.



బెజ్జూర్: భాజాభజంత్రీలతో వెళ్తున్న ప్రజలు

కెరమెరి మండలంలో..

కెరమెరి: మండల కేంద్రంలో గ్రామ పటేల్ సోనేరావు, అర్చకుడు కులకర్ణి బాపూజీ జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జమ్మి ఆకుతో శివాలయంలోని శివపార్వతులు, దుర్గాదేవికి పూజలు చేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ దసరా శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ వేడుకలు జరుపుకొన్నారు.

రెబ్బెన మండలంలో..

రెబ్బెన: దసరా సందర్భంగా మండలంలోని ఆయా



ఆసిఫాబాద్‌రూరల్: మోతుగూడలో..

గ్రామాలతోపాటు గోలేటి టౌన్‌షిప్‌లో రావణ దహన కార్యక్రమాలు, శమీ పూజలు నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. ఆయా కార్యక్రమాల్లో ఏరియా జీఎం విజయ భాస్కర్‌రెడ్డి, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి తిరుపతి, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్‌రాజు శ్రీనివాస్‌రావు, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, బీజేపీ జిల్లా కోశాధికారి కిరణ్‌కుమార్, నాయకులు చిరంజీవిగౌడ్, గోగర్ల రాజేశ్, అజయ్‌జైస్వాల్, నవీన్‌జైస్వాల్ తదితరులు పాల్గొన్నారు.



కెరమెరి: జమ్మిచెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు



రెబ్బెన: పల్లకి మోస్తున్న ఏరియా జీఎం, భక్తులు

‘యువత చూపు బీజేపీ వైపు’

ఆసిఫాబాద్‌అర్బన్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై యువత బీజేపీలో చేరడానికి ముందుకు వస్తున్నట్లు వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్, సీనియర్ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మండలంలోని మానిక్‌గూడ, అడ గ్రామాలకు చెందిన సుమారు 50 మంది యువకులు అరిగెల ఆధ్వర్యంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు వేసి బీజేపీలోకి ఆహ్వానించారు. అనంతరం నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో బీజేపీ ఎప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు దీపక్‌రావ్, ప్రసాద్‌గౌడ్, వైద్య వెంకన్న, మాటూరి జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న నాగేశ్వర్‌రావు

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

కౌటాల: ఉన్నత చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి రాజేందర్‌గౌడ్ అన్నారు. వీర్దండి గ్రామానికి చెందిన నక్క భిక్షపతి, నిఖిత దంపతుల కుమారులు నక్క శ్రావణ్, నక్క రక్షిత్ నీట్‌లో ర్యాంక్ సాధించి ఒకరు ఎంబీబీఎస్, ఒకరు బీడీఎస్‌లో సీటు సాధించడంతో శుక్రవారం బీజేపీ నాయకులు, గ్రామస్తులు వారిని సన్మానించారు. రాజేందర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువత ఉన్నతంగా ఎదగాలని తెలిపారు. చదువుకు పేదరికం అడ్డుకాదని, పట్టుదల కలిగి చదువుకోవాలని తెలిపారు. శ్రావణ్‌కు వికారాబాద్‌లోని మహావీర్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్‌లో సీటు రాగా రక్షిత్‌కు నల్గొండలోని కామినేని మెడికల్‌కాలేజీలో బీడీఎస్‌లో సీటు వచ్చినట్లు తెలిపారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని వారు అన్నారు. కార్యక్రమంలో నాయకులు మధుకర్, చందు, బాజీరావ్, తదితరులు పాల్గొన్నారు.



అభినందిస్తున్న బీజేపీ నాయకులు, గ్రామస్తులు

జోడేఘాట్‌కు సందర్శకుల తాకిడి

కెరమెరి: మండలంలోని జోడేఘాట్‌లో శుక్రవారం సందర్శకుల తాకిడి కనిపించింది. మండలంలోని పోలీసు కుటుంబాలవారు, దనోరా, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ ప్రాంతాల నుంచి వచ్చిన వారు మ్యూజియం సందర్శించారు. కుమురంభీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమాధి వద్ద పూజలు చేశారు.



నివాళులర్పిస్తున్న మహిళలు

ఘనంగా ‘అలయ్ బలయ్’



‘అలయ్ బలయ్’లో పాల్గొన్న ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్‌టౌన్: పద్మశాలీ సంఘాలు సామాజిక, సమానత్వ, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణలో కీలకపాత్ర పోషిస్తున్నాయని బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్ పట్టణంలోని పద్మశాలీ భవనంలో పద్మశాలీల ఆధ్వర్యంలో దసరా అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. దసరా సందర్భంగా అందరూ ఒక్కచోట చేరి సంప్రదాయ వేడుకలు నిర్వహించడం సంతోషకరమన్నారు. కొంగ సత్యనారాయణ, సిందం చంద్రయ్య, పోచం, నరేందర్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కెరమెరి: మండలంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33కేవీ కెరమెరి ఫీడర్ మరమ్మతు కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా కేవీపీఎస్ ఆవిర్భావ వేడుకలు

వాంకిడి: మండలంలోని ఖిరిడి గ్రామంలో గురువారం కేవీపీఎస్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మండల ప్రధాన కార్యదర్శి వడ్లూరి నాగేశ్ జెండా ఎగురవేశారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం దిన్‌కర్ మాట్లాడుతూ.. ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన లక్ష్యాలతో కేవీపీఎస్ అనేక పోరాటాలు సాగిస్తోందని తెలిపారు. 27 ఏళ్లుగా అనేక విజయాలు సాధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తిక్, ఉపాధ్యక్షుడు నిఖిల్, నాయకులు తిరుపతి, మల్లేశ్, రామయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న నాగేశ్

సద్దుల బతుకమ్మ సంబురాలు



సద్దుల బతుకమ్మ సంబురాల్లో మహిళలు

కౌటాల: మండలంలోని గ్రామాల్లో గురువారం రాత్రి భక్తిశ్రద్ధలతో సద్దుల బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. పిల్లలు, మహిళలు వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో బతుకమ్మ పాటలు పాడుతూ ఆటలు ఆడారు. దీంతో గ్రామాల్లో సందడి నెలకొంది.


పోస్టర్ ఆవిష్కరణ

కెరమెరి: జోడేఘాట్‌లో ఈ నెల 7న నిర్వహించనున్న కుమురం భీం వర్ధంతికి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ అబ్దుల్ కలాం ఆవిష్కరించారు. భీం మనుమడు కుమురం సోనేరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ కుమురం లాలు, రిజ్వాన్, అంబారావు ఉన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఘనంగా ధమ్మచక్ర పరివర్తన దినోత్సవం



ఎల్కపల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ధమ్మ చక్రప్రవర్తన దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకుముందు పంచశీల జెండా ఆవిష్కరించారు.

కౌటాల: మండలంలోని మహర్ ప్రజలు, నాయకులు ధమ్మచక్ర పరవర్తనం ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో మహర్ కులస్తులు శాంతి ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.